క్లుప్తంగా

సేవా గుణం అలవర్చుకోవాలి



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ నరసింహారెడ్డి చెప్పారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెల అందజేసే పింఛన్ల ప్రక్రియను మంగళవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి ఒక్కొక్కరికి రూ. 100 చొప్పున పింఛన్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, సంస్థ సభ్యులు సుబ్బయ్య, రాములమ్మ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి చేయూత



జేసీబీతో గుంతలు తవ్విస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యుత్ సౌకర్యం కోసం పూర్వ విద్యార్థి న్యాయవాది నాగభూషణంరెడ్డి తనవంతుగా మంగళవారం గుంతల ఏర్పాటుకు జేసీబీ యంత్రాన్ని ఏర్పాటు చేసారు. కళాశాల అభివృద్ధికి చేయూతని నిస్తున్న నాగభూషణంరెడ్డిని ప్రిన్స్‌పాల్ భారతిపాటు అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉమామల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భవానీ మాలధారులు

డోన్ : పట్టణంలోని ఉమామల్లేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మంగళవారం పురస్కరించుకొని భవానీస్వామి మాలధారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన ధర్మకర్త ఆర్ట్ రమణ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అలంకరణ చేశారు.

యాగంటిలో పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న గుండం శేషిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని పవిత్ర శైవక్షేత్రమైన యాగంటిలో ఉమామహేశ్వరులకు మంగళవారం రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం పూజారులు ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదం అందజేశారు. కార్యక్రమంలోనాయకులు కాటసాని పుల్లారెడ్డి, జగదీశ్వరరెడ్డి మన్యం రాంబాబు శ్రీకాంత్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

కోవెలకుంట్ల: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్థానిక సివిల్ కోర్టు న్యాయవాదులు నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీం సాహెబ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయతీ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, బాలమురళీ, ప్రేమ్‌నాథ్, మల్లికార్జునరెడ్డి, విష్ణుమనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఓబులేసు, రాజశేఖర్, రమేష్, తిరుపాలు, సుధాకర్, కాశీం, చంద్రుడు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : భూహక్కు చట్టం 512 రద్దు చేయాలని కోరుతూ న్యాయవాదులు రెండవ రోజు మంగళవారం నిరసనలు కొనసాగించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి బాలరంగడు, కోశాధికారి శ్రీనివాసులు, ఐఏఎల్ రాష్ట్ర కార్యదర్శి రాగుల రాముడు, సీనియర్ న్యాయవాదులు వేణుగోపాల్‌గౌడ్, మద్దయ్య ఈశ్వర్, నాగరాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విళక్కి పూజ

కోవెలకుంట్ల: స్థానిక గాంధీనగర్‌లో వెలసిన హరిహర అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం విళక్కి(దీపోత్సవం) పూజ నిర్వహించనున్నట్లు అయ్యప్పసేవా సమితి సభ్యులు తెలిపారు. దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా కుందూనది నుంచి నీటిని తెచ్చి అయ్యప్పస్వామికి అష్టాభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కేరళవారి శింగారి మేళ తాళాలతో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా కొనసాగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ మండల నూతన అధ్యక్షుడు సీవీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో మాజీ అధ్యక్షుడు వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా సీవీ శ్రీనివాసులు,అసోసియేట్ అధ్యక్షులు ధనుంజయ, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వడ్ల శ్రీనివాసులు ఆచారిని ప్రకటించారు. ఉపాధ్యాయులు దానమయ్య, నాగ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో...
అన్నివర్గాలకు సమన్యాయం

ప్యాపిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతోందని జెడ్పీటీసీ సభ్యులు బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మూడో సచివాలయం ఆవరణలో మంగళవారం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపసర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాట్లాడారు. ఈ సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.27 కోట్ల మేర లబ్ధి చేకూరిందని తెలిపారు. సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నవారు నేరుగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని వారు కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు బోరెడ్డి రాము, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజా మురళీకృష్ణ, గండికోట చిన్న రామాంజనేయులు, సీబిల్లి రంగన్న, బషీర్, కొండయ్య, మస్తాన్‌ఖాన్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

కోవెలకుంట్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలోని మూడవ గ్రామ సచివాలయాల పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తదితరులతో కలిసి ఆయన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగురవేశారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా మాట్లాడుతూ సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు డీబీటీ ద్వారా రూ. 16.66 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ. 7.18 కోట్లు, వివిధ అభివృద్ధి పనులకు రూ. 4.38 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఈఓ గోపినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, కామేశ్వరరెడ్డి, మహేశ్వర రెడ్డి, ఎంఎల్‌ఓ రమేష్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

డోన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. పట్టణంలోని ఏడవ సచివాలయం పరిధిలోని 10, 11 వార్డులలో మంగళవారం కమిషనర్ వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం నవరత్నాల పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నామన్నారు. సంక్షేమ పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, కౌన్సిలర్ బుర్రు రమాదేవి, సచివాలయ కన్వీనర్‌లు సతీష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం





కోవెలకుంట్ల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు   డోన్: కార్యక్రమంలో మాట్లాడుతున్న సప్తశైల రాజేష్

కాశీరెడ్డి నాయన ఆశ్రమం ముస్తాబు

- నేడు ఆరాధన మహోత్సవం
- ఏర్పాట్లను పరిశీలించిన సీఐ రామంజులు



కాశీనాయన, నరసింహ స్వామి లైట్ల కటౌట్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ,ఎస్‌ఐ

సంజామల: మండల పరిధిలోని అల్వకొండ క్రాస్ వద్ద వెలసిన కాశీనాయన ఆశ్రమం 28వ ఆరాధన మహోత్సవాలకు ముస్తాబు అయింది. బుధవారం భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. విద్యుత్ బల్బుల వెలుగులో ఆశ్రమం కళకళలాడుతోంది. ఆశ్రమంలో వెలసిన ఆలయాల్లో కుంభస్థాపన, సకల దేవతల హోమం, పూర్ణాహుతి అభిషేకాలు తదితర కార్యక్రమాలు అర్చకులు నిర్వహిస్తారు. పోచా శీలరెడ్డి, పోచా శంకర్ రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి, పోచా వెంకట రామిరెడ్డి పర్యవేక్షణలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, కాశకావేషం, భక్త చింతామణి నాటకం, చెక్క భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. అదేవిధంగా ఎండ్లబండి లాగుడు, కబడ్డీ, గార్దబాల పోటీలు ఏర్పాటు చేశారు. పెద్దఎత్తున భక్తులు తరలిరానున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాట్లను ఎస్‌ఐ ప్రతాప్‌తో కలిసి సీఐ రామంజులు పరిశీలించారు. ట్రాఫిక్ తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలను నిర్వాహకులకు సూచించారు. వాహనాల పార్కింగ్ ఏర్పాటుపై ఆరా తీశారు. ప్రశాంతగా ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా నిర్వాహకులకు సీఐ సూచించారు.

గాలేరు నగరి కాల్వకు నీటి విడుదల

కొలిమిగుండ్ల: అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు–నగరి కాల్వ ద్వారా మంగళవారం సంబంధిత అధికారులు నీటిని విడుదల చేయడంతో కొలిమిగుండ్ల మండలంలోని పెద్దవెంతుర్ల, కమ్మవారిపల్లె, కోటపాడు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో మిరప, నూగు, పెసర తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉండటంతో రెండు రోజుల క్రితం రైతులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే అధికారులతో చర్చించడంతో చెర్లోపల్లె సమీపంలో ఉన్న గేట్లను ఎత్తి 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేయించారు. పెద్దవెంతుర్ల సమీపంలోని జీఎన్ఎస్ కాల్వలో నీరు నిల్వ ఉండేలా అడ్డుకట్టు వేసుకున్నారు. నీటిని విడుదల చేయించిన ఎమ్మెల్యే కాటసానికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

తమ్ముడిపై దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని నాగమళ్లకుంట గ్రామానికి చెందిన ఉల్లి చిన్నయ్యపై ఆస్తి పంపకాల విషయంలో అన్న పెద్దయ్యతోపాటు తండ్రి క్రిష్ణుడు, బంధువులు మధు, రవి, రామేశ్వరి దాడికి పాల్పడ్డారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ మంగళవారం తెలిపారు.

మిరపకు సోకే తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

కోవెలకుంట్ల: మిరప పంటకు సోకే వివిధ రకాల తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖ అధికారిణి ధరణి సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల మండలంలోని అమడాల, సౌదరదిన్నె, బిజనవేముల గ్రామాల్లో రైతులు కుళాయప్ప, రామసుబ్బయ్య, వెంగన్న, చిన్నికృష్ణుడు, నాగప్రతాప్‌రెడ్డికి సంబంధించిన మిరప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మిరపలో రసం పీల్చుపురుగు ఉధృతి, బూడిద తెగులు ఉండటాన్ని గమనించామన్నారు. రసం పీల్చుపురుగు నివారణకు ఎకరాకు వంద చొప్పున, పసుపు, నీలి, తెలుపురంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే లీటరు నీటికి 0.25 ఎంఎల్ బ్రోఫ్లనిలిడ్ మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు లీటరు నీటికి 0.5 గ్రాముల ట్రీఫ్లక్సోబిన్ మందును కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది శశిరేఖ, మనోజ్ పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారు జామున మోస్తారు వర్షం కురిసింది. వాతావరణంలో పూర్తిగా మార్పులు చోటు చేసుకొని ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. రెవెన్యూ అధికారుల లెక్కల ప్రకారం 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. వర్షానికి తోడు చలిగాలులు వీస్తుండడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. శనగ, కంది, మినుము సాగు చేసిన రైతులకు వర్షం ఊరట కల్పిస్తున్నా వరి కోత దశలో ఉండటంతో ఆందోళన చెందుతున్నారు.

కోవెలకుంట్ల: తుపాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో మోస్తరు వర్షం కురిసింది. సంజామల మండలంలో 10.4 మిమీ, కొలిమిగుండ్ల–6.2 మిమీ, కోవెలకుంట్ల– 5 మిమీ, దొర్నిపాడు– 4.6 మిమీ, అవుకు మండలంలో 3.2 మిమీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో సాగు చేసిన పప్పుశనగ, జొన్న, కంది, మినుము, పెసర, తదితర పంటలకు తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం ఊరటనిచ్చింది.

అధిక సాంద్రత సాగుపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

బనగానపల్లె రూరల్ : రైతులు అధిక సాంద్రత పత్తి సాగుపై దృష్టి సారించాలని నంద్యాల ప్రాంతీయపరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సతీష్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన ప్రపంచ నేలల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో అధిక సాంద్రత పద్ధతితో సాగు చేపడితే అధిక లాభాలనిస్తోందన్నారు. వాతావరణం అనుకూలిస్తే కనీసం ఎకరాకు 8–12 క్వింటాళ్ల దిగుబడి పొందవచ్చునన్నారు. నేలలో సారవంతం పెంచుకోవడానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ నేల, నీరు జీవానికి మూలాధారం అన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, రవిగౌడ్, లక్ష్మీప్రియ, నందికొట్కూరు డివిజన్‌కు చెందిన జలకనూరు, శాతనకోట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కొలిమిగుండ్ల: మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా వ్యవహరించి పంటలను కాపాడుకోవాలని ఏఓ జ్యోతి సూచించారు. మంగళవారం కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లో మిరప, వరి తదితర పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతు వరిపంట గింజ కోతకు సిద్ధంగా ఉన్నందున తక్షణమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. పత్తి,మిరప పంటల్లో వర్షాలు తగ్గిన తర్వాత తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



మాట్లాడుతున్న హెచ్‌ఎం రామ చంద్రారెడ్డి

బనగానపల్లె : బడిఈడు పిల్లలు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని ఎంఈఓ స్వరూప, వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం తిరుపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో విద్య ప్రాముఖ్యతపై డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం పెట్రోల్ బంకు సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. 5–18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బడిలోనే ఉండాలని, ఆ దిశగా ప్రజలను చైతన్య పరచాలని ఈ సందర్భంగా వారు డ్రాక్రా మహిళలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శ్రీనివాసులు, సీఆర్‌టీలు మధు, ఐసీడీఎస్ సూజర్‌వైజర్లు సాలమ్మ, చిట్టెమ్మ, జమీలా, మండల సమాఖ్య అధ్యక్షురాలు హుస్సేన్‌బీ, సెక్రటరి నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సంజామల: బడిఈడు బడిలోనే ఉండేలా వలంటీర్లు ప్రజలను చైతన్య పరచాలని హెచ్‌ఎం రామ చంద్రారెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్లలో మంగళవారం వలంటీర్లుతో నిర్వహించిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడారు. తమకు కేటాయించిన ఇళ్లకు సంబంధించి బడిమానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించి చిన్నారులు చదువు కొనసాగించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రిష్ణయ్య,వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ధరణి తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని తహసీల్దార్ విద్యాసాగర్,మండల విద్యాధికారి ప్రభాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాల్లో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, హెచ్‌ఎంలతో వారు సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ 5నుంచి 18ఏళ్ల వయసులోపు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు.

కొలిమిగుండ్ల: బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సాయికృష్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎంఈఓ అబ్దుల్ కలాంతో కలిసి పాఠశాలల హెచ్‌ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించి తల్లితండ్రులతో పాటు విద్యార్థులతో మాట్లాడి చదువు మధ్యలో ఆపడానికి గల కారణాలను తెలుసుకొని మళ్లీ చేరేలా ప్రోత్సహించాలని సూచించారు.

బేతంచెర్ల: బడి ఈడు పిల్లలు వందశాతం హాజరయ్యేలా చూడాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న అన్నారు. మంగళవారం స్థానిక అమ్మవారిశాలలో ఎంఈఓలు సోమశేఖర్, జనార్దన్ గౌడు ఆధ్వర్యంలో జీఈఆర్ సర్వేలో భాగంగా 5–18 సంవత్సరాలలోపు బడి ఈడు పిల్లల హాజరుపై గ్రామ సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్స్, వలంటీర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక కారణాలతో బడికి దూరం కాకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, పౌష్టికాహారం అందజేస్తుందని వివరించారు.



బనగానపల్లె పెట్రోల్ బంకు సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడిన డ్వాక్రా మహిళలు

ముస్లింపై రాజద్రోహం కేసులు పెట్టించిన ఘనత బాబుది

- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

బనగానపల్లె రూరల్ : ముస్లిం సోదరులపై రాజద్రోహం వంటి కేసులు పెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని రాష్ట్ర ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహిద్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, సైకిల్ షాపు మహమ్మబూబ్ వలి, మౌలానా ఆరఫత్ విమర్శించారు. అయితే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 3న జరిగిన ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లింల అభివృద్ధి జరగలేదని, వారిపై దాడులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే బీసీ చేసిన ఆరోపణలను వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు ఖండించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లిం సోదరులకు 4 శాతం రిజర్వేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. తండ్రిబాటలో తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారన్నారు. గత టీడీపీ పాలనలో షాదీ తోఫా కేవలం రూ.50 వేలు మాత్రమే చెల్లించగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష రూపాయలకు పెంచారని, మౌజన్, ఇమాంలకు గౌరవవేతనం కింద టీడీపీ పాలనలో కేవలం ఐదు వేల మసీదులకు రూ.3వేలు, రూ.5వేలు ఇవ్వగా నేడు రాష్ట్రవ్యాప్తంగా 8వేల మసీదులకు సంబంధించిన మౌజన్ ఇమాంలకు రూ.5వేలు, రూ.10వేలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. గుంటూరులో జరిగిన ఓ సమావేశంలో నంద్యాలకు చెందిన టీడీపీ ముస్లిం నాయకుడు చంద్రబాబును ప్రశ్నించడంతో ఆయనపై రాజద్రోహం కేసు పెట్టించిన విషయాన్ని ముస్లింలు ఎప్పటికీ మరువరన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అధికారంలో ఉండగా షాదీఖానా ఎందుకు నిర్మించలేదో ముస్లింలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ముస్లింకు అండగా నిలిచిన ఎమ్మెల్యే కాటసాని

ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముస్లింకు అన్నివిధాలుగా అండగా నిలిచారని, ప్రతి సమస్యను పరిష్కరిస్తూ వారికి చేయూతనిస్తున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గతంలో 2009లో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణంలోని ఈద్గాకు రూ. 25 లక్షలు తన సొంత నిధులతో ప్రహరీ ఏర్పాటు చేయడం జరిగిందని, నేడు షియా మతస్తులకు చెందిన ఇబాదత్ ఖానాను(పార్థన మందిరం) సైతం రూ.40 లక్షల సొంత నిధులు వెచ్చించి నిర్మించారని వివరించారు. అదేవిధంగా ముస్లిం అభివృద్ధికి అన్నివిధాలా ఎమ్మెల్యే కాటసాని కృషి చేస్తున్నారన్నాని, జీఎం టాకీస్ వెనుక వైపు ఉన్న ముస్లిం శ్మశానవాటిక సర్వే చేయించి రూ.69లక్షల ప్రభుత్వ నిధులలో ప్రహరీ నిర్మించారన్నారు. మర్కస్ మసీద్ వద్ద పార్కింగ్‌కు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారని, బనగానపల్లె, కోవెలకుంట్లలో పట్టణాల్లో రూ.2.40 షాదీఖానాల నిర్మాణ పనులు ప్రారంభించారని గుర్తు చేశారు. అయితే ఈ అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే బీసీకీ మాత్రం కనబడడం లేదని, అన్నివిషయాలను ముస్లిం సోదరులు గమనిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుట్రపూరిత ఆరోపణలు చేయడం టీడీపీ మాజీ ఎమ్మెల్యేకు తగదని, పద్ధతి మార్చుకోకుంటే ముస్లింల తిరుగుబాటు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితర ముస్లిం మైనార్టీ నాయకులు ఉన్నారు.

ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలి

- జడ్జి తంగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి తంగమణి

డోన్ టౌన్ : విభిన్న ప్రతిభావంతులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం పురష్కరించుకొని స్థానిక ఎస్కేపీ హైస్కూల్లో మంగళవారం సెక్రైడ్, పల్లవి, విశ్వక్రాంతి, మండల వికలాంగుల సమాఖ్యల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విభిన్నప్రతిభావంతులు గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అనేక పథకాలు అందుబాటులోకి తెచ్చిందని, సద్వినియోగం చేసుకుని స్థిరపడాలని సూచించారు. అదేవిధంగా చట్టబద్ధంగా అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సొంతంగా లాయర్‌ను ఏర్పాటు చేసుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఉచితంగా న్యాయసేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, యూనియన్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు బోరెడ్డి, జయదేవి, సెక్రైడ్ డైరెక్టర్ తిప్పన్న, స్ఫూర్తి మధు, వికలాంగుల సంస్థ నాయకులు జయన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

డోన్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనల నిమిత్తం స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సంక్షేమ హాస్టళ్ల వార్డెన్‌లు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ సహాయకులు సమావేశానికి హాజరు కావాలన్నారు. అదేవిధంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈబీసీ సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలోని స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ, నంద్యాల, జమ్మలమడుగు, బనగానపల్లె, అవుకు తదితర ప్రాంతాలవైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్ తదితర రికార్డులు లేని వాహన చోదకులకు జరిమానా విధించారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

డోన్ టౌన్ : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం, క్షేమం అని డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ అన్నారు. నవంబర్‌కు సంబంధించి గిఫ్ట్ స్కీం విజేతలను మంగళవారం డీఎం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను ప్రోత్సహించేందుకు గిఫ్ట్ స్కీం ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. డోన్ నుంచి కర్నూలుకు పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే వారు దిగిపోయేప్పుడు వారి టిక్కెట్ వెనకాల పేరు సెల్ నంబరు రాసి డ్రైవర్ వెనుక ఏర్పాటు చేసిన లక్కీడిప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతి పక్షం రోజులకు ఒక సారి డిప్ తీసి విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఇందులో భాగంగా నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు సంబంధించిన టిక్కెట్లను స్థానిక పాతబస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో డిప్ తీశారు. మొదటి, రెండవ విజేతలుగా కర్నూలుకు చెందిన అల్లిపీరా, ప్రమోద్, మూడవ బహుమతి వెల్దుర్తికి చెందిన శ్రీరామశెట్టికి అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం